## హైకోర్టును ఆశ్రయించిన ప్లాట్ల యజమానులు

- హైదరాబాద్‌కు తరలివెళ్లిన 150 మంది బాధితులు

కలెక్టరేట్, జూన్ 3 : కొత్తపల్లి ప్లాట్ల యజమానులు న్యాయం కోసం హైకోర్టు గడప తొక్కారు. సీలింగ్ భూమి పేర ప్రభుత్వం ప్లాట్ల రిజిస్ట్రేషన్లు రద్దు చేయడంతో, తమకు జరుగుతున్న అన్యాయంపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సుమారు 150 మంది వరకు మంగళవారం ఉదయం జిల్లా కేంద్రం నుంచి తరలివెళ్లి పిటిషన్లు దాఖలు చేసినట్లు తెలుస్తున్నది. కొత్తపల్లి మండలం కొత్తపల్లి గ్రామ శివారులో గల సర్వే నం.175, 197, 198లలో దాదాపు 20 ఎకరాల్లో 476 మంది కొనుగోలు చేసిన ప్లాట్లను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు గత నెల చివరి వారం నుంచి రద్దు ప్రక్రియ కూడా మొదలుపెట్టి సోమవారం నాటికి పూర్తి చేసింది. కాగా, వీటిని కొనుగోలు చేసిన వారంతా దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే కావడంతో, తమ కష్టార్జితాన్ని ప్రభుత్వం ఒక్క ఉత్తర్వుతో రద్దు చేసిందంటూ లబోదిబోమంటున్నారు. భవిష్యత్ అవసరాల కోసం తాము కొనుగోలు చేసిన స్థిరాస్తిని భద్రంగా ఉంచితే, సీలింగ్ భూమి పేరుతో లాక్కునే ప్రయత్నాలు చేస్తుండడం పట్ల వారి వేదన వర్ణనాతీతంగా మారింది. అధికారుల సమన్వయలేమితోనే ఆ భూమిలో లావాదేవీలు జరిగాయనేది బహిరంగ రహస్యమే అయినా, రిజిస్ట్రేషన్లు రద్దు చేయడం పట్ల వ్యతిరేకత పెల్లుబికుతున్నది. ముందుగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి ఆ ప్లాట్లపై తమకున్న హక్కులు తొలగించడం ఏమేరకు సమంజసమనే ప్రశ్నలు యజమానుల నుంచి వస్తున్నాయి. వాస్తవానికి నిషేధిత భూముల జాబితాలు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల వద్ద విధిగా ఉంటాయి. అయితే, వాటిని పట్టించుకోకుండా ముందుగా రిజిస్ట్రేషన్లు చేసి, అనంతరం రద్దు చేయడం పట్ల ప్లాట్ల యజమానులు తీవ్రస్థాయిలో మండిపడుతూ, న్యాయస్థానానికి వెళ్లినట్లు తెలుస్తున్నది. కాగా, ప్లాట్ల రద్దుపై ఇప్పటికే జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతితో పాటు ఇతర అధికారులను కూడా కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అయితే, దీనిపై సదరు నేతలు, అధికారుల స్పందన కూడా అంతంతమాత్రమే అన్నట్లుగా ఉన్నదని కొంతమంది ప్లాట్ల యజమానులు పేర్కొంటున్నారు. రెండు దశాబ్దాల క్రితమే తాము ప్లాట్లు కొనుగోలు చేసి, తమ పిల్లలకు ఉపయోగపడుతుందనే భావనతో కాపాడుకుంటుండగా, రిజిస్ట్రేషన్లు రద్దు చేసిన ప్రభుత్వం తమ కుటుంబాలను దెబ్బతీసిందనే ఆవేదన వారిలో వ్యక్తమవుతున్నది.

## ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి



ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శేఖర్‌గౌడ్, పార్టీ శ్రేణులు

మానకొండూర్, జూన్ 3: నిత్యం వందల సంఖ్యలో మితి మీరిన వేగంతో వెళ్తున్న ఇసుక లారీలు, టాక్టర్లతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం మండల కేంద్రంలో పల్లెమీద చౌరస్తావద్ద ఆందోళన చేశారు. ఇసుక లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ, ఊటూర్ క్వారీ నుంచి ఇసుక తరలిస్తున్న లారీలు నిత్యం వందల సంఖ్యలో మానకొండూర్ నుంచి వెళ్తున్నాయన్నారు. మితిమీరిన వేగంతో వెళ్తున్న లారీలతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. క్వారీ నిర్వాహకులు క్వారీ ప్రదేశంలో ఎలాంటి పార్కింగ్ సౌకర్యం కల్పించకపోవడంతో లారీల డ్రైవర్లు రహదారుల పక్కనే లారీలను నిలుపుతున్నారని, దీంతో వాహన దారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మాముళ్ల మత్తు వీడి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని కోరారు. అనుమతులకు విరుద్ధంగా అధిక లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మానకొండూర్ నుంచి ఇసుక లారీలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు గుర్రం కిరణ్‌గౌడ్, పిట్టల మధు, కొత్తకొండ నాగరాజు, గడ్డం సంపత్, బోడ రాజశేఖర్, బుర్ర సత్యనారాయణ, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ల శాఖలో ఇన్‌వర్టర్ పనిచేయక ఇబ్బందులు

కలెక్టరేట్, జూన్ 3: జిల్లాకేంద్రంలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు వినియోగించే ఇన్‌వర్టర్ సక్రమంగా పనిచేయకపోవడంతో, ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఆశాఖ సిబ్బంది చెబుతున్నారు. కొద్దిరోజులుగా తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుండగా, రిజిస్ట్రేషన్లు చేయడంలో జాప్యం జరుగుతుందన్నట్లు పేర్కొంటున్నారు. ఇన్‌వర్టర్ బ్యాటరీల కాలం చెల్లడంతో సమస్య తలెత్తినట్లు సమాచారం. కాగా, దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు అధికారులు వెల్లడించారు.

## పీహెచ్‌సీలలో సాధారణ డెలివరీలను ప్రోత్సహించాలి

విద్యానగర్, జూన్ 3: ప్రాథమిక ఆరోగ్య సెంటర్(పీహెచ్‌సీ)లలో సాధారణ డెలివరీలను ప్రోత్సహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు, మంగళవారం ఆయన ఎంసీహెచ్ పీవో డాక్టర్ సన జవేరియాతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొత్తపల్లిలో జరుగుతున్న ఆశ డే కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా అక్కడ సీవై- టీబీ టెస్టులను లాంఛనంగా ప్రారంభించారు. అలాగే వాటికి సంబంధించిన విధివిధానాలను వివరించారు. సబ్ సెంటర్ వారీగా అన్ని ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశుభ్రతను, లేబర్ రూమ్‌చ ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ అందరూ పీహెచ్‌సీలో సాధారణ డెలివరీలను ప్రోత్సహించాలని, అభా రిజిస్ట్రేషన్ కార్డులను ఇంప్రూవ్ చేయాలన్నారు, అంతకుముందు ఆసిఫ్ నగర్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వనజ, డాక్టర్ శ్రావిక, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం: డీఎం శ్రీనివాస్

తెలంగాణచౌక్, జూన్ 3: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) బసులో ప్రయాణం సురక్షితమని డిపో-2 మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గల డీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమంలో డిపో పరిధిలోని పలు గ్రామాలను నుంచి ప్రయాణికులు చేసిన సూచనలు, సలహాలు, ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు.

## పారమిత పాఠశాల స్కౌట్ విద్యార్థుల ప్రతిభ

కొత్తపల్లి/హౌసింగ్‌బోర్డుకాలనీ, జూన్ 3 : నగరంలోని మంకమ్మతోట పారమిత ఉన్నత పాఠశాలకు చెందిన స్కౌట్స్ విద్యార్థులు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో కవాతు చేసి అద్భుత ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. వేడుకలలో హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, కరీంనగర్ జిల్లాల నుంచి 73 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొనగా, పారమిత ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చిగురు సమర్థ్, 10వ తరగతి చదువుతున్న బోయినిపల్లి లక్ష్మీగణేశ్ అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారన్నారు. కవాతు చేసిన విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇనుగంటి ప్రసాదరావు అభినందించారు.

## సిలిండర్లతో వెళ్తున్న ఆటో ట్రాలీని ఢీకొన్న లారీ

హుజూరాబాద్ రూరల్, జూన్ 3: మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై మంగళవారం పెను ప్రమాదం తప్పింది. హుజూరాబాద్ పట్టణానికి చెందిన జాహ్నవి గ్యాస్ ఏజెన్సీకి చెందిన ఆటో ట్రాలీ సిలిండర్లతో కరీంనగర్ వైపు వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో నడి రోడ్డుపై గ్యాస్ సిలిండర్లు చెల్లాచెదురుగా పడ్డాయి. గ్యాస్ సిలిండర్ల నుంచి గ్యాస్ లీక్ కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. ట్రాలీ డ్రైవర్‌కు స్వల్పగాయాలు కావడంతో హాస్పిటల్‌కు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆయిల్ ట్యాంకర్, ఆటో ట్రాలీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఘటనపై విచారణ జరుపుతున్నారు.

## ఎల్ ఎండీ గేట్-1 వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొత్తపల్లి, జూన్ 3 : కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్ఎండీ డ్యామ్ కట్ట ఎల్ఎండీ గేట్-1 వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు పోలీసులు తెలిపారు. అతడి వయసు సుమారు 35-40 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎత్తు 5.7, బ్లూ కలర్ జీన్స్, వైట్ అండ్ బ్లాక్ చెక్స్ ఫుల్ షర్టు ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. దాదాపు రెండు, మూడు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని తెలిపారు. ఆర్ఐ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

గంగాధర, జూన్ 3: మండలంలోని గర్శకుర్తి గ్రామానికి కొత్తపల్లి మండలం ఎలగందుల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను(ఏపీ15 టీబీ5810, టీఎస్02 యూబీ9082 నంబర్లు) మంగళవారం పట్టుకున్నట్లు పెద్దాచంపల్లి వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు బోనాల పరశురామ్, రాజకొండ రమేశ్, బొంతపల్లి అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# మారిన నగర రూపురేఖలు




నగరపాలక సంస్థ కార్యాలయం

- పునర్విభజనతో 66 డివిజన్లు
- డివిజన్‌కు 4500 నుంచి 5700 ఓటర్లు
- ముసాయిదా విడుదల చేసిన నగరపాలక అధికారులు
- రేపటి నుంచి అభ్యంతరాల స్వీకరణ

కార్పొరేషన్, జూన్ 3: కరీంనగర్ నగర పాలక సంస్థలోని డివిజన్ల రూపురేఖల్లో సమూలంగా మార్పులు జరిగాయి. 66 డివిజన్లతో నగరపాలక సంస్థ అధికారులు ముసాయిదా జాబితా రూపొందించారు. ప్రతి డివిజన్‌లోనూ 4500 ఓటర్ల నుంచి 5700 మధ్య ఓటర్లు ఉండేలా నగరపాలక అధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా నగరంలో విలీనమైన కొత్తపల్లి మున్సిపాలిటీ, బొమ్మకల్, చింతకుంట, గోపాల్‌పూర్, దుర్శేడ్, మల్కాపూర్ గ్రామాలను కలుపుకొని రూపొందించిన నూతన డివిజన్ల ముసాయిదా జాబితాను నగరపాలక అధికారులు విడుదల చేశారు. దీనికి సంబంధించి కసరత్తును మంగళవారం పూర్తి చేశారు. ఈనెల 5 నుంచి 12 తేదీ వరకు ముసాయిదా జాబితాపై ఆయా ప్రాంతాల నుంచి వచ్చే అభ్యంతరాలను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి ఈనెల 21న తుది జాబితాను విడుదల చేయనున్నారు.

### తీగలగుట్టపల్లిలో మొదటి డివిజన్

నగరపాలక సంస్థ అధికారులు రూపొందించిన ముసాయిదా జాబితాలో మొదటి డివిజన్‌ను తీగలగుట్టపల్లి నుంచి మొదలు పెట్టి కార్ఖానాగడ్డ, గాంధీరోడ్డు వద్ద 66వ డివిజన్‌ను ముగించారు. టాటాయ్స్ పద్ధతిలో డివిజన్లను విభజించారు. గతంలోని 60 డివిజన్ల రూపురేఖలు సమూలంగా మార్పులు జరిగాయి. గతంలోని డివిజన్లలో అత్యధికంగా మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి. పలు డివిజన్ల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గతంలో రాంనగర్, పద్మనగర్ కలుపుకొని ఒక డివిజన్ ఉండగా ప్రస్తుతం పద్మనగర్, గాంధీనగర్ కలుపుకొని ఒక డివిజన్‌గా రూపొందించారు. గోపాల్‌పూర్, దుర్శేడ్ కలిపి ఒక డివిజన్‌గా కాగా, బొమ్మకల్‌లోని కొంత ప్రాంతం ఆటోనగర్, గుంటూర్‌పల్లిని కలిపి 4వ డివిజన్‌గా ఏర్పాటు చేశారు. సదాశివపల్లి, బొమ్మకల్‌లోని కొన్ని ప్రాంతాలు కలిపి ఒక డివిజన్‌గా మారింది. అలాగే కొత్తపల్లి మున్సిపాలిటీని రెండు డివిజన్లుగా విభజించారు. చింతకుంట కూడా రెండు డివిజన్లుగా మారగా... మల్కాపూర్, లక్ష్మీపూర్ ఒక డివిజన్‌గా ఏర్పాటు చేశారు. వీటితో పాటు అనేక డివిజన్ల భౌగోళిక స్వరూపాల్లో అనేక మార్పులు జరిగాయి.

### అత్యధికంగా డివిజన్‌లో 5700 ఓటర్లు

నగరపాలక అధికారులు రూపొందించిన ముసాయిదా డివిజన్ల విభజనలో అత్యధికంగా ఆరో డివిజన్ అల్గునూర్‌లో 5697 ఓటర్లు ఉండగా.. అత్యల్పంగా 44వ డివిజన్ సీతారాంపూర్‌లో 4584 మంది ఓటర్లు ఉన్నారు. మిగిలిన అన్ని డివిజన్లలో అత్యధికంగా 5 వేల ఓటర్ల ఉండేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. నగరంలో మొత్తంగా 3,35,592 ఓటర్లు ఉండగా ప్రతి డివిజన్‌కు 5 వేల ఓటర్లు ఉండేలా అధికారులు ముసాయిదా రూపొందించారు. కాగా నగరపాలక సంస్థలో ఇప్పటికే డివిజన్ల సరిహద్దులతో పాటు రిజర్వేషన్ల తీరుపై కూడా జోరుగా చర్చలు సాగుతున్నాయి. ఏయే డివిజన్లలో ఏయే ఇంటి నంబర్లు వస్తాయన్న విషయంలో జోరుగా చర్చలు నడుస్తున్నాయి. పలువురు నాయకులు తమకు అనుకూలంగా డివిజన్లు రూపురేఖలు వస్తున్నాయో లేదో అన్న విషయంలో ఆరా తీసే పనుల్లో నిమగ్నమయ్యారు. ముసాయిదా విడుదల కావడంతో ఈనెల 5 నుంచి ఆయా డివిజన్లకు సంబంధించిన అభ్యంతరాలను తెలిపేందుకు పలువురు నాయకులు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తున్నది.

# రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కొత్తపల్లి/కరీంనగర్ రూరల్, జూన్ 3 : భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, కరీంనగర్ మండలం దుర్శేడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన భూభారతి గ్రామ రెవెన్యూ అవగాహన సదస్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చే ప్రతి దరఖాస్తుకు రసీదు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సకాలంలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా,



దుర్శేడ్‌లో దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్

ఇప్పటి వరకు భూ భారతికి సంబంధించి లాగిన్ రావడం లేదని కరీంనగర్ రూరల్ మండల తహసీల్దార్ రాజేశ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, తహసీల్దార్ ఎన్. రాజేశ్, ఆర్.వెంకటలక్ష్మి, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు. కాగా, ఆసిఫ్‌నగర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు సంబంధించి అధికారులు సమాచారం ఇవ్వకపోవడంతో చాలా మంది రైతులు సమస్యలను విన్నవించుకోలేకపోయారు.

## నుస్తులాపూర్ వద్ద అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం

తిమ్మాపూర్, జూన్ 3: తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నుస్తులాపూర్ స్టేజీ వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంపై యువకులు రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి వేగంగా వస్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొని డివైడర్‌కు తాకి బోల్తా పడింది. ప్రమాదంలో గ్రామానికి చెందిన బేతి వినయ్ రెడ్డి, మోటుకూరి రవిందర్, వేనంక నరేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయ పడిన వారిని కరీంనగర్ దవాఖానా కు తరలించారు. కాగా ప్రమాదంలో గాయపడిన వినయ్ రెడ్డికి పది రోజుల కిందనే వివాహమైంది.

## అందుబాటులో విత్తనాలు

కొత్తపల్లి, జూన్ 3 : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్‌లో మంగళవారం విత్తన మహోత్సవం నిర్వహించారు. రైతులకు విత్తనోత్పత్తి చేసిన విత్తనాలను అందుబాటులో ఉంచారు. వ్యవసాయ పరిశోధన స్థానంలో మక్క, కంది, పెసర, నువ్వు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రధాన శాస్త్రవేత్త డా. జి ఉషారాణి సూచించారు.

## సామాజిక తనిఖీ ప్రజావేదిక

శంకరపట్నం, జూన్ 3: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 15వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో ఏప్రిల్ 2024-మార్చి 2025 వరకు నిర్వహించిన రూ. 5.49 కోట్ల నిధుల ఉపాధి పనులపై ఆడిటింగ్ చేశారు. ఆయా గ్రామాల్లో ఉపాధి కూలీల కూలి డబ్బులు, మెటీరియల్, తదితర చెల్లింపులకు సంబంధించిన ఆడిట్ వివరాలను డీఆర్‌పీలు చదివి వినిపించారు. కాగా ప్రజావేదిక సుదీర్ఘంగా రాత్రి వరకు కొనసాగింది. డీఆర్‌డీవో వేణుమాధవ్‌రెడ్డి, ఏపీడీ కృష్ణ, ఏవోఏ వెంకటేశ్వర్‌రెడ్డి, పీఎం సత్యనారాయణ, ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎస్ఆర్‌పీ బాలూనాయక్, ఏపీవో శారద, టీఏలు ఎఫ్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రేత అరెస్ట్

కొత్తపల్లి, జూన్ 3: బీహార్ నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని కొత్తపల్లి పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇవి.. బావుపేట గ్రామంలో కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం పోలీసు సిబ్బంది తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో రాంరెడ్డి చికెన్ సెంటర్ ఎదుట ఓ వ్యక్తి నల్లని పాలిథిన్ కవర్‌తో పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా, వెంటనే అదుపులోకి తీసుకున్నారు. కవర్‌ను తనిఖీ చేయగా, అందులో గంజాయి వాసన కలిగిన పువ్వులు, మొగ్గలు లభించాయి. విచారణలో నిందితుడు తన పేరు రాంపర్వేష్ సాయిని (46) అని, బీహార్ రాష్ట్రానికి చెందిన వాడినని తెలిపాడు. బీహార్ నుంచి బావుపేట గ్రామానికి వచ్చి గ్రానైట్ కంపెనీలో పనిచేస్తున్నట్లు పేర్కొన్నాడు. అతడి నుంచి 1.2 కిలోల గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రాంపర్వేష్ సాయినిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, తదుపరి చర్యల కోసం కోర్టుకు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ గంజాయి పట్టుబడడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐ సాంబమూర్తి, సిబ్బందిని సీపీ గౌష్ ఆలం, ఏసీపీ శుభం ప్రకాశ్ అభినందించారు.

## ట్రైనీ ఎస్ఐ వీడియో వైరల్

హుజూరాబాద్, జూన్ 3: ఇటీవల సైదాపూర్ మండలం గొల్లగూడెంకు చెందిన మహేందర్‌పై ట్రైనీ ఎస్ఐ భార్గవ్ చేయి చేసుకున్నాడని సోషల్ మీడియాలో వార్తలు వస్తున్న క్రమంలో ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి మంగళవారం వైరల్ అవుతున్నది. మహేందర్‌ను ట్రైనీ ఎస్ఐ భార్గవ్ కొడుతున్నట్లు సదరు వీడియోలో రికార్డు కాగా, అది పలు సోషల్ మీడియా గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నది. గత నెల 8న మహేందర్ మొలంగూర్ నుంచి సైదాపూర్‌కు వస్తుండగా, వాహన తనిఖీలో భాగంగా అతడి వెహికల్‌ను చెక్ చేయడానికి ట్రైనీ ఎస్ఐ ఆపారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఈ ఘటన జరిగినట్లు తెలిసింది. ఈ విషయంపై ఏసీపీ మాధవిని అడుగగా, వీడియో వైరల్ అవుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, నిజా నిజాలను తెలుసుకోవడానికి విచారణ చేస్తామని చెప్పారు.

## నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

హుజూరాబాద్ రూరల్/టౌన్/కరీంనగర్ రూరల్/గంగాధర, జూన్ 3: ప్రతి పంటలో నాణ్యమైన విత్తనాలు వాడినప్పుడే అధిక దిగుబడులు సాధించగలమని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు తెలిపారు. మంగళవారం నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాల్లోని రెవెన్యూ గ్రామాల్లో ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేశారు. విత్తన సాంకేతికతను గ్రామ స్థాయికి తీసుకెళ్లడం ద్వారా రానున్న రెండు మూడు సంవత్సరాల్లో ప్రతి గ్రామం విత్తన స్వయం సమృద్ధిని సాధించనున్నట్లు తెలిపారు. హుజూరాబాద్ రైతు వేదికలో హుజూరాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు సునీత, కరీంనగర్ మండలం చామనపల్లి రైతు వేదికలో ప్రాంతీయ వరి పరిశోధన స్థానం చింతకుంట శాస్త్రవేత్త డాక్టర్ ఉషారాణి, గంగాధర రైతు వేదికలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ రజినీ దేవి విత్తన నాణ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఆయా మండలాల వ్యవసాయాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల నుంచి దరఖాస్తుల వెల్లువ

జమ్మికుంట/ వీణవంక, /మానకొండూర్ రూరల్/శంకరపట్నం/తిమ్మాపూర్ రూరల్/చిగురుమామిడి/గన్నేరువరం, జూన్ 3: రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. జమ్మికుంట మండలం విలాసాగర్‌లో సదస్సులో 71 దరఖాస్తులు, వీణవంక మండలం బేతిగల్ గ్రామంలో 155, శంకరపట్నం మండలం మెట్‌పల్లిలో 179 దరఖాస్తులు వచ్చినట్లు ఆయా మండలాల తహసీల్దార్లు వెంకట్‌రెడ్డి, రజిత, సురేఖ తెలిపారు. మానకొండూర్ మండలం ముంజంపల్లి, ఈదుల గట్టెపల్లి గ్రామాల్లో మొదటి రోజు భూ భారతి రెవెన్యూ సదస్సులను తహసీల్దార్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముంజంపల్లిలోని రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై దరఖాస్తులను తహసీల్దార్‌తో కలిసి స్వీకరించారు. తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ రెవెన్యూ సదస్సులో 15 అర్జీలు, చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో 33 దరఖాస్తులు, గన్నేరువరం మండలం యస్వాడలో రెవెన్యూ సదస్సులో ఐదు దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్లు శ్రీనివాస్ రెడ్డి, రమేశ్, నరేందర్ తెలిపారు. జమ్మికుంట మండలం విలాసాగర్, వీణవంక మండలంలోని బేతిగల్, శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు హాజరయ్యారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

మానకొండూర్ రూరల్, జూన్ 3: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మద్దికుంట గ్రామానికి చెందిన పూసాల భాను ప్రకాశ్ (19) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. పూసాల సుమలత-శ్రీనివాస్ దంపతులకు కుమారుడైన భాను ప్రకాశ్ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. మే 29న ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న అతడిని గుర్తు తెలియని కారు ఢీకొన్నది. తీవ్ర గాయాలు కావడంతో హాస్పిటల్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం తుది శ్వాస విడిచాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. తల్లి దండ్రులకు ఏకైక కుమారుడు కావడంతో వారి రోదనలు మిన్నంటాయి. అందరితో కలివిడిగా ఉండే భాను ప్రకాశ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 3: నగరంలో 11కేవీ ఫీడర్ మరమ్మతులు, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, స్తంభాల షిఫ్టింగ్, లైన్ మెయింటనెన్స్ పనులు చేపడుతున్నందున బుధవారం నగరంతో పాటు కరీంనగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-1, టౌన్-2, కరీంనగర్ రూరల్ ఏడీఈలు పంజాల శ్రీనివాస్, ఎం లావణ్య, రఘు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 8నుంచి 10గంటల వరకు హౌసింగ్‌బోర్డుకాలనీ, విట్స్ కాలేజీ, సుభాష్ విగ్రహం ఏరియా, వరాహ స్వామి గుడి ప్రాంతం, మారుతీ నగర్, బొమ్మకల్ రోడ్డు, వాటర్ ట్యాంక్, ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు చింతకుంట గ్రామంలో కొంత ప్రాంతం, కమాన్‌పూర్ గ్రామంలో కొంత భాగం, గ్రానైట్ ఇండస్ట్రీస్, ఉదయం 8నుంచి 10గంటల వరకు ముకరంపుర, గీతాభవన్, భగత్ నగర్, మున్సిపల్ ఆఫీసు ఏరియా, జడ్పీ ఆఫీసు ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## చెక్ పోస్టులను తనిఖీ చేసిన సీపీ

హౌసింగ్‌బోర్డుకాలనీ, జూన్ 3: పశువుల అక్రమ రవాణా నివారణకు కమాన్‌పూర్ వడ్డేపల్లి, మొగ్దుంపూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సోమవారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీల తీరు, తనిఖీలకు సంబంధించిన వాహన వివరాల నమోదు రికార్డులను పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. రాత్రి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత రక్షణ పాటిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి భారీ, అతి భారీ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. చెక్ పోస్టుల తనిఖీల అనంతరం, పట్టణంలోని కరీంనగర్ ఒకటో, రెండో, మూడో పోలీస్ స్టేషన్లను సైతం సీపీ తనిఖీ చేశారు. డయల్ 100 ద్వారా అందిన ఫిర్యాదులు, వాటి నమోదు తీరు, సిబ్బంది స్పందించిన విధానంపై ఆరా తీశారు. వివిధ నేరాల్లో పట్టుబడి, పోలీస్ స్టేషన్ల ఆవరణలో ఉన్న వాహనాల వివరాలు సైతం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

## 7,8 తేదీల్లో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

- జిల్లా బ్యాడ్మింటన్ సంఘ ప్రధాన కార్యదర్శి వై ఉపేందర్‌రావు




పోటీల వివరాలను వెల్లడిస్తున్న వై ఉపేందర్‌రావు

కొత్తపల్లి, జూన్ 3 : కరీంనగర్ జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7, 8 తేదీల్లో జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ సీనియర్ ఉపాధ్యక్షుడు వై ఉపేందర్‌రావు తెలిపారు. మంగళవారం సాయంత్రం కరీంనగర్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. అండర్ 11, 13, 15, 17, 19, ఓపెన్ మెన్, ఉమెన్ విభాగాల్లో వయసుల వారీగా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 35+,40+, 45+, 50+, 55+, 60+,65+, 70+, 75+ అన్ని విభాగాల్లో సింగిల్స్, డబుల్ అంశాల్లో పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించడంతోపాటు, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే కరీంనగర్ జిల్లా క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఈ పోటీలను రెండు రోజులపాటు కరీంనగర్ క్లబ్, రెవెన్యూ క్లబ్‌లలో నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల జిల్లాలోని క్రీడాకారులు ఈనెల ఆరో తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా షటిల్ కోచ్ రవి వద్ద ఎంట్రీ ఫీజు చెల్లించి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి సిరి రవి, పోటీల నిర్వహణ కమిటీ చైర్మన్ జి. ఆనంద్‌కుమార్, జగిత్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. రామ్‌మోహన్ రావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు లింగంపల్లి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## పేదల పక్షపాతి హరీశ్‌రావు



కేక్ కట్ చేసి హరీశ్‌రావు పుట్టిన రోజు వేడుకలు జరుపుకొంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుజూరాబాద్ టౌన్, జూన్ 3: మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పేదల పక్షపాతి అని, ఆపద అన్న వారికి కొండంత అండగా నిలుస్తారని బీఆర్‌ఎస్ నాయకులు కొనియాడారు. హరీశ్ రావు జన్మదినం సందర్భంగా మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. హరీశ్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లు పంచిపెట్టారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతోని జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు తాళ్లపెల్లి శ్రీనివాస్, ఉమామహేశ్వర్, యాదగిరి, ముక్క రమేశ్, ముత్యం రాజు, బీఆర్‌ఎస్ మండల పట్టణాధ్యక్షులు ఐలయ్య, కొలిపాక శ్రీనివాస్, నాయకులు చొల్లేటి కిషన్‌రెడ్డి, పంజాల శ్రీధర్‌గౌడ్, కొయ్యడ కమలాకర్, చింత శ్రీనివాస్, కేసరి మధుకర్‌రావు, మధు, కెక్కర్ల సారయ్య, మధు, మైఖేల్ రాజేందర్, రాజు, సమ్మయ్య, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ లక్ష్మణమూర్తితో పాటు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హరీశ్ రావు జన్మదిన ఫ్లెక్సీల తొలగింపు హేయనీయం

హుజూరాబాద్ టౌన్, జూన్ 3: సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణభవన్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ప్రభుత్వం తొలగించడం హేయమైన చర్య అని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏనాడూ ఇలాంటి చర్యలకు తావివ్వలేదని, ప్రతి పార్టీ నాయకుడికి తాము తగిన గుర్తింపు ఇచ్చామని తెలిపారు. ప్రతిపక్ష నాయకుడి ఫ్లెక్సీలను తొలగించడం మంచి పద్ధతి కాదని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు.

## డిగ్రీ కళాశాలకు దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్ మంజూరు

జమ్మికుంట, జూన్ 3: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్ మంజూరైందని ప్రిన్సిపాల్ డాక్టర్ బీ రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ అడ్మిషన్ల కోసం దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న సమయంలో సాంకేతికమైన, దరఖాస్తుపరమైన, వెబ్ ఆప్షన్లలో సమస్యలు తలెత్తినప్పుడు హెల్ప్‌లైన్ ద్వారా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. దోస్త్‌లో సమస్యలుంటే కళాశాల దోస్త్ కో-ఆర్డినేటర్, టెక్నికల్ సిబ్బందిని ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

## అర్హుల ఎంపికలో అధికారులు విఫలం

చిగురుమామిడి, జూన్ 3: మండలంలో ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాల అమలులో అధికార పార్టీ నేతల జోక్యంతో అర్హులను ఎంపిక చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె స్వామి విమర్శించారు. మండలంలో కేంద్రంలోని సీపీఐ భవన్‌లో మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అధికారుల తీరుపై కలెక్టర్, జడ్పీ సీఈవోకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్నస్వామి, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ, పైడిపల్లి వెంకటేశ్, రైతు సంఘం మండల కార్యదర్శి గోలి బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

తెలంగాణచౌక్, జూన్ 3: అసెంబ్లీలో ఆమోదించిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వెంటనే అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలీ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలకు ఎన్నికల కన్న ముందే బీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. బీసీలు ఐక్య పోరాటాలతో హక్కులను సాధించుకోవాలని పేర్కొన్నారు.

## వైద్య శిబిరాన్ని సందర్శించిన అడిషనల్ డీఎంహెచ్‌వో

వీణవంక, జూన్ 3: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం వీణవంక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ హెల్త్‌క్యాంపును అడిషనల్ డీఎంహెచ్‌వో డా.సుధారాజేంద్ర సందర్శించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.చందు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్, కంట్రోలర్ డా.సురేందర్‌రెడ్డి, డా.వరుణ, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## 9న అరుణాచలానికి స్పెషల్ బస్

హుజూరాబాద్ టౌన్, జూన్ 3: ఈనెల 9న అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్రకు హుజూరాబాద్ ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు హుజూరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న మధ్యాహ్నం 2 గంటలకు హుజూరాబాద్ బస్ స్టేషన్ నుంచి బస్ బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనానంతరం మరుసటి రోజు 10వ తేదీ రాత్రి వరకు అరుణాచలం చేరుకుని, 11న అరుణాచల గిరి ప్రదక్షిణ అనంతరం తిరిగి సాయంత్రం 4 గంటలకు బయలుదేరి 12న హుజూరాబాద్‌కు బస్ చేరుకుంటుందని డీఎం తెలిపారు. పెద్దలకు రూ.4,500, పిల్లలకు రూ.3,800 ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. అడ్వాన్స్ బుకింగ్ కోసం 9959225924, 9704833971, 9247159535, 9441404841 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.